విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

సోమవారం 21 జూలై 2025 8 పేజీలు

భూమాతను కుళ్లబొడిచి ప్రకృతి సంపదను కరిగించేసి..

ఓ వైపు అధికార పార్టీ నేతల ఆశీర్వాదం.. మరోవైపు అధికారుల అండ... ఇంకేముంది... ప్రభుత్వ భూములలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రకృతి సంపద అయిన తెల్లరాయిని (వైట్‌క్వార్ట్జ్) లోడ్ల కొద్దీ తవ్వేస్తున్నారు. మార్కెట్లో లక్షల వరకు పలుకుతోంది. దీంతో అక్రమార్కులు సరిహద్దులు దాటించేస్తున్నారు. ఇలా ప్రకృతి సంపదను దిగమింగుతున్నా అడిగేనాథుడే కరువయ్యారు.

విశాలాంధ్ర-పిసీపల్లి : వివరాల్లోకి వెళితే... కనిగిరి నియోజకవర్గం పిసిపల్లి మండలంలోని మురుగమ్మి గ్రామం నుండి బయోగ్యాస్ ప్లాంట్ ప్రాంతానికి వెళ్లే మార్గ మధ్యలో ప్రభుత్వ అటవీ భూములలో అక్రమార్కులు యథేచ్ఛగా తెల్ల రాయిని భారీగా వెలికితీశారు. అధికారుల అండదండలు పుష్కలంగా ఉండడంతో అక్రమార్కులు తవ్వకాలు చేపట్టి సరిహద్దులు దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు, అధికారులకూ మామూళ్లు అందుతుండటంతో ఎవరూ నోరెత్తడంలేదు. దీంతో యథేచ్ఛగా ప్రభుత్వ, అటవీ శాఖ భూముల్లో ఎక్స్‌కవేటర్‌తో నిత్యం తవ్వకాలు చేపడుతున్నారు. వెలికితీసిన రాయిని రాత్రికి రాత్రి - మిగతా 2 లో

- ప్రభుత్వ అటవీ భూముల్లో అక్రమంగా తెల్ల రాయి వెలికితీత
- సర్వే నంబర్ 403లో ప్రభుత్వ భూములా? అటవీ భూములా?
- తెల్ల రాయిని స్వాధీనం చేసుకోని అధికారులు
- అక్రమార్కులకు అధికారుల అండదండలు
- ఎల్లల దాటిపోతున్న తెల్లరాయి.. పట్టపగలే అక్రమ రవాణా
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- మామూళ్ల మత్తులో అధికారులు

24న సెక్యులర్ భారత రాజ్యాంగం

లాల్, నీల్ మైత్రి ఆవశ్యకతపై సదస్సు

డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు

విశాలాంధ్ర-ఒంగోలు : ఈనెల 24వ తేదీన ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో సెక్యులర్ భారత రాజ్యాంగం - లాల్, నీల్ మైత్రి ఆవశ్యకత అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరువది సుబ్బారావు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని స్థానిక సివిఎన్ రీడింగ్ రూమ్ ఆవరణంలో ఆదివారం ఆవిష్కరించారు. సుబ్బారావు మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో లాల్ (కమ్యూనిస్టులు), నీల్ (అంబేద్కరిస్టులు) శక్తులు గణనీయ పాత్ర వహించారని అన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించుకున్నామని తెలిపారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతత్వంతో కూడిన రాజ్యాంగ చట్టబద్ధ పాలన అందిస్తారని, స్వదేశీ పాలకులపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారన్నారు. దేశంలో వనరులు, విజ్ఞానం పెరిగి సంపదలు పెరుగుతున్న, ఆచరణలో కొందరే సంపదలు పొందుతున్నారన్నారు. అశేష ప్రజానికం వివక్షకు గురవుతూ, విద్యకు - మిగతా 2 లో

భూములు పరిశీలించిన డీఆర్‌డీఓ ప్రతినిధులు 4 లో..

'తీగలేరు-5'పైనే ఆశలు

- నిధులు కేటాయించాలని సర్వత్రా వినతులు
- పనులు చేపట్టాలని తీగలేరు సాధన సమితి డిమాండ్

విశాలాంధ్ర-పుల్లలచెరువు : దశాబ్దాలుగా ఎటువంటి తాగు, సాగునీటి వనరులు లేక విలవిలాడుతున్న పుల్లలచెరువు మండలానికి త్వరలోనే వెలిగొండ జలాలు తాకనున్నాయనే ఆశ చిగురిస్తోంది. ఇందులో భాగమైన తీగలేరు-5 కాలువను పుల్లలచెరువుకు సమీపంలో ఉన్న చిన్న కండ్లేరుకు చేరిస్తే పుల్లలచెరువు మండల వాసులకు తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఈ తీగలేరు కాలువ ద్వారా కొమరోలు, ఎండ్రపల్లి, పిఆర్సి తండా, మల్లపాలెం, ఉమ్మడివరం, వెంకటరెడ్డిపల్లె తదితర గ్రామాలకు తాగు సాగునీటి సమస్యలు శాశ్వతంగా తొలగనున్నాయి. అయితే తీగలేరు-5

కాలువకు సంబంధించి పనులు కొనసాగించేలా ప్రభుత్వం జీవో జారీ చేసినప్పటికీ అరకొరగా నిధులు కేటాయించడంపై, రైతు సంఘాల నాయకులు, తీగలేరు సాధన కమిటీ సభ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వంపై పోస్ట్ కార్డు ద్వారాను ఉద్యమం జరిపి చర్చకు తెర తీశారు. తమ వినతిని, విజ్ఞప్తిని రాష్ట్ర ముఖ్యమంత్రికి తెలిపారు. తీగలేరు కాలువపై చిత్తశుద్ధి ఉంటే తమ ప్రాంతానికి మేలు చేయాలని వారు కోరారు. అయితే తీగలేరు కాలువ నిర్మాణానికి తీగలేరు సాధన పోరాట సమితికి అటు అధికార, ఇటు ప్రతిపక్ష నాయకుల నుంచి మద్దతు లేకపోవడంతో రాజకీయాలు కేవలం పబ్బం గడుపుకోవడానికేనా అంటూ అసహనం ప్రదర్శిస్తున్నారు. రైతాంగానికి మేలు చేసే ఉద్యమంలో భాగస్వామ్యం ఎందుకు కాలేకపోతున్నారని ప్రతిపక్షాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ తీగలేరు కాలువ పూర్తయితే చిన్న కండ్లలేరు ఆయకట్టు కింద 11,500 ఎకరాలు సాగులోనికి రానున్నాయి. నియోజకవర్గంలో 66,300 ఎకరాలు సాగులోనికి రానుంది. ప్రధాన - మిగతా 2 లో

ఎస్ఐ భాగ్యరాజ్ సమయస్ఫూర్తి..

నిలిచిన మూడు ప్రాణాలు

2లో

కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు

మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి

ఎస్సై భాగ్యరాజ్ సమయస్ఫూర్తి..

- నిలిచిన మూడు ప్రాణాలు
- ఇద్దరు కుమార్తెలతో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించిన మహిళ
- వేగంగా స్పందించి ప్రాణాలను కాపాడిన వెదుళ్ళపల్లి ఎస్సై
- సిబ్బందిని అభినందించిన ఎస్పీ తుషార్ డూడి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : వెదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజ్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో తల్లి ఇద్దరు కుమార్తెలతో రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించగా మూడు నిండు ప్రాణాలను రక్షించారు. వివరాలలోకి వెళితే ఒక మహిళ ఇద్దరు పిల్లలతో కలిసి రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నిస్తుందని వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్‌కు కాల్ వచ్చింది. దీంతో వెదుళ్ళపల్లి ఎస్సై భాగ్యరాజ్ తన సిబ్బందితో త్వరితగతిన స్పందించి ఘటనా స్థలానికి చేరుకుని, స్టూవర్టుపురం రైల్వే స్టేషన్ పరిధిలోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు యత్నించిన మహిళ, ఆమె కుమార్తెలను చాకచక్యంగా కాపాడారు. ఆత్మ హత్యకు యత్నించడానికి దారి తీసిన కారణాల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. కుటుంబ వివాదాల నేపథ్యం కారణమని తెలుసుకొని, వారి నివాసానికి వెళ్లి ఇరువురికి కుటుంబ విభేదాలపై కౌన్సిలింగ్ నిర్వహించి, కుటుంబ సమస్యలను పరస్పర చర్చల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలని సూచించారు. పోలీసులు వేగంగా స్పందించడం వల్లనే ముగ్గురు ప్రాణాలు నిలిచాయని, క్షేమంగా వారిని తీసుకువచ్చినందుకు వెదుళ్ళపల్లి పోలీసులకు, జిల్లా ఎస్పీ తుషార్ డూడిలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు స్పందించిన తీరు పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వ్యక్తిగతంగా కుటుంబ పరంగా ప్రతి ఒక్కరికి సమస్యలు ఉంటాయన్నారు. వాటిని సానుకూలంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవడానికి కృషి చేయాలన్నారు. ఎలాంటి ఒత్తిడిలోనైనా ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ఒక్కసారి మీ కుటుంబం, పిల్లల భవిష్యత్ దృష్టిలో ఉంచుకొని ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్క సమస్యకు తప్పనిసరిగా పరిష్కార మార్గం ఉంటుందన్నారు. తగిన సలహా, మార్గదర్శనం కోసం మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్ లేదా కుటుంబ కౌన్సెలింగ్ కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీస్ శాఖ శక్తి బృందాలను ఏర్పాటు చేసిందని, మహిళలపై వేధింపులు, గృహ హింస, కుటుంబ విభేదాల వంటి సమస్యల పరిష్కారానికి మహిళా పోలీసులతో కూడిన ప్రత్యేక బృందం అందుబాటులో ఉందని జిల్లా ప్రజలు వీరి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. 100/112 నెంబర్ల నుంచి వచ్చే కాల్స్ పట్ల పోలీస్ అధికారులు వేగంగా స్పందించాలన్నారు. వేగంగా స్పందించి ముగ్గురి నిండు ప్రాణాలను కాపాడిన వేదుళ్లపల్లి ఎస్సై భాగ్యరాజ్‌ని వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

ప్రకృతి సంపదను కరిగించేసి..

(మొదటిపేజీ తరువాయి)

తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది.

ప్రభుత్వ భూములా... లేక అటవీ భూములా? :

ఇదిలా ఉండగా మురుగమ్మి ప్రాంతంలో అక్రమంగా తెల్లరాయి నిక్షేపాలు జరుగుతున్న ప్రాంతానికి విశాలాంధ్ర రిపోర్టర్ వెళ్లి పరిశీలించగా సర్వేనెంబర్ 403 లో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్నట్లు పరిశీలించవటమైనది. ప్రభుత్వ వెబ్ ల్యాండ్‌లో అవి అటవీ భూములను స్పష్టంగా కనపడుతున్నాయి. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించగా అవి మా భూములు కాదని రెవెన్యూ భూములని అటవీశాఖ అధికారులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక తహసిల్దార్ కు తెలియపరచగా సంఘటనా స్థలానికి చేరుకుని అవి అటవీ భూమిలేనని తహసీల్దార్ నిర్ధారించారు. అటవీశాఖ అధికారులు అవి రెవిన్యూ భూముల అని ఆరోపిస్తుండటం రెవెన్యూ అధికారులు కాదు అవి అటవీ భూములని అంటున్నారు. దీంతో అవి అటవీ భూములా లేక రెవెన్యూ భూములా? అధికారులే తేల్చాలి.

మామూళ్ల మత్తులో : అక్రమార్కులకు ఆయా గ్రామాల్లో అధికార పార్టీ నేతల అండదండలు పుష్కలంగా ఉన్నాయి. దీంతో రెవెన్యూ, పోలీసు, అటవీ శాఖ అధికారులను సైతం మామూళ్ల మత్తులో ముంచుతూ వారి కార్యకలాపాలను నిర్విరామంగా కొనసాగిస్తున్నారు. కొంతమంది రెవెన్యూ, అటవీ శాఖాధికారులు అక్రమార్కులతో కలియ తిరుగుతూ వారు పబ్బం గడుపుకొంటున్నారు. ఉన్నతాధికారుల సమాచారం వారికి ముందుగానే అందిస్తూ వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టే తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకొని సంబంధిత భూములు అటవీ భూములా లేక ప్రభుత్వ భూములా నిగ్గ తేల్చాలని స్థానికులు కోరుతున్నారు.

తెల్ల రాయిని స్వాధీనం చేసుకొని అధికారులు : ఇదిలా ఉండగా భారీగా తెల్ల రాయి వెలికి తీసి ఉండడంతో అధికారులు ఎవరు ఆ వైపుకు పోవడం లేదు. సుమారు 1000 టన్నుల మేర తెల్ల రాయిని వెలికి తీసి ఉన్నారు. అక్రమార్కులు రాత్రికి రాత్రే రాయిని మాయం చేయకముందే అధికారులు స్పందించి తెల్ల రాయిని స్వాధీనం చేసుకుంటారో లేదో వేచిచూడాల్సిందే.

కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు

- ఇచ్చిన మాట ప్రకారం గ్రీన్ టాక్స్ తగ్గింపు
- మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నాం, ఇచ్చిన మాట ప్రకారం గ్రీన్ టాక్స్ తగ్గించామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రవాణా వాహనాలపై గ్రీన్ టాక్స్ (హరిత పన్ను) తగ్గించినందుకు గానూ ఆదివారం తూర్పునాయుడుపాలెంలోని క్యాంప్ కార్యాలయంలో సింగరాయకొండ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి స్వామిని కలిసి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని గజమాలతో సత్కరించారు. మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ.....వైసీపీ హయాంలో వాహనదారులపై రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పెంచి మోయలేని భారం మోపింది. గత 5 ఏళ్ళు ఓ వైపు పెట్రోల్, డీజిల్ ధరలు మరోవైపు పన్నులతో రాష్ట్రంలో రవాణా రంగం కుదేలైంది. నాడు ప్రతిపక్షంలో ఉన్నపుడు రవాణా వాహనదారుల సమస్యలు చూసిన చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే గ్రీన్ టాక్స్ తగ్గిస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఆ హామీ నెరవేర్చారు. ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తున్నాం. అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమ ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపినవారిలో ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సింగరాయకొండ లారీ అసోసియేషన్ అధ్యక్షులు చిగురుపాటి శేషగిరి, కార్యదర్శి పటేల్, సుబ్బారావు తదితరులు ఉన్నారు.

'తీగలేరు-5'పైనే ఆశలు

(మొదటిపేజీ తరువాయి)

కాలువ ఎర్రగొండపాలెం మండలంలోని వీరాయపాలెం వద్ద 48.15 కిలోమీటర్ల వద్ద ముగుస్తుంది. ప్రాజెక్టు మొదటి అలైన్మెంట్ ప్రకారం ఇక్కడి నుంచి మొదలయ్యే టి -5 చిన్న కండ్లలేరులో కలవాల్సి ఉంది. ఇందుకుగాను మల్లాపాలెం ప్రాంతంలోని అటవీ ప్రాంతం గుండా తవ్వాల్సిరావడంతో పాత అలైన్మెంట్ను మార్చేశారు. ఇలా అలైన్మెంట్లు మార్చారే తప్ప ముందుకు సాగకపోవడంతో ప్రభుత్వంపై నియోజకవర్గాల ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల నాయకులు పోరాటం చేస్తూనే ఉన్నారు. వెలిగొండ జలాలు తమ ప్రాంతాలను తాకాలని రైతుల కల. ఇందుకుగాను ఈ పోరాటంలో అందరూ భాగస్వామ్యం కావాలని తీగలేరు సాధన పోరాట కమిటీ సభ్యులు కోరుతున్నారు.

తీగలేరు వస్తుందని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న రైతులు

పూల సుబ్బయ్య వెలుగుగొండ ప్రాజెక్టు తీగలేరు 5 కాలవ వస్తుందని కళ్ళలో ఒత్తులు ఏసుకొని ఎదురుచూస్తున్న రైతంగానికి నిరాశ ఎదురవుతుంది. వర్షాధారంపై ఆధారపడి పంటలు వేయాలంటే రైతులకు వ్యవసాయం ఒక సవాలుగా మారింది. భూగర్భ జలాలు పూర్తిగా పడిపోయి పుల్లలచెరువు మండలంలో 1000 అడుగులు వేసిన నీళ్లు పడక వ్యవసాయ సంక్షోభం ఏర్పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేసిన పంటలకు గిట్టుబాటు ధర లేక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మిర్చి పొగాకు మొక్కజొన్న. పత్తి కంది బొప్పాయి నిమ్మ ఏ పంట వేసిన గిట్టుబాటు ధర లేక అప్పుల పాలయ్యారు. ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో లేకపోవడంతో వ్యవసాయానికి మొగ్గు చూపని పరిస్థితి ఏర్పడింది. తాగునీరు సాగునీరు కూడా దశాబ్దాల నుండి నీటి కష్టాలు తప్పటం లేదు. వీటన్నిటికీ పూర్తి పరిష్కార మార్గం పూలు సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తీగలేరు 5 తోనే సాధ్యమని రైతులు ఎంతగానో ఎదురుచూస్తున్న పరిస్థితి నెలకొన్నది. మండల కేంద్రంలో ఉన్న చిన్న కండ్లేరు చెరువు వరకు తీగలేరు-5 కాలువ పొడగించి ప్రభుత్వం నిధులు కేటాయించి పనులు చేపట్టాలని ప్రజలు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

చెట్టుపైనుంచి పడి కూలీ మృతి

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని అరుంధతి నగరి చెందిన జెల్లి శ్రీనివాసరావు ఈ నెల 4వ తేదీన కొత్తపల్లి కోటేశ్వరరావుకు టెంకాయలు కోయటానికి కూలీకి వెళ్లి టెంకాయ చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తూ 30అడుగులు ఎత్తు నుండి కింద పడ్డాడు. వైద్యచికిత్సల నిమత్తం ఒంగోలులోని కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించిగా డిశ్చార్జి అయిన రెండు రోజుల తరువాత శ్రీనివాసరావు స్వగృహం నందు మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు మగ పిల్లలు (దివ్యంగులు వయసు 10,5) ఒక్క కూతురు (7) ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులను మాజీ సర్పంచ్ కొమ్ము రమేష్ పరామర్శించి సానుభూతిని తెలియజేశారు. రెక్కాడితే కానీ డొక్కాడని ఈ పేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రమేష్ కోరారు.

లాల్, నీల్ మైత్రి ఆవశ్యకతపై సదస్సు

(మొదటిపేజీ తరువాయి)

ఉపాధికి నామమాత్రపు అవకాశాలు పొందుతున్నారన్నారు. స్వాతంత్రకాంక్ష కొరకు ఎదురుచూసిన పేదలు భూమి, భుక్తి, వివక్షకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం, కార్మికులు, మహిళలు, దళిత శక్తులు, వామపక్షాలు, బహుజన ఉద్యమాలలో భాగస్వాములు అవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో భూస్వామ్య, పెట్టుబడి దాడి, జలారి శక్తులు ప్రభుత్వ పాలనపై ప్రజాసంతృప్తిని సంఘటిత రూపం కాకుండా మనువాద పాలకులు అధికారంలోకి వచ్చిన కారణంగా, ఆనాటి నుండి ప్రజా సమస్యలపై ప్రజా పోరాటాలను నీరుగార్చడానికి మతం, కులం ఎజెండాగా ప్రాంతీయతత్వాన్ని పెంచారన్నారు. రైతాంగం గిట్టుబాటు ధరల కొరకు, నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతుంటే, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కానరావడం లేదన్నారు. స్వల్ప ఆదాయాలు పొందుతున్న వర్గాలు పెరుగుతున్న ధరలు జీవిత భద్రతలేమి వెంటాడుతున్నాయన్నారు. చట్టబద్ధ రాజ్యాంగ వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం సన్నగిల్లుతుందన్నారు. ఈ పరిస్థితులు లాల్ శక్తులు నాయకత్వంలో నీల్ శక్తుల నాయకత్వంలో విడివిడిగా చేస్తున్న పోరాటాలు, ఉద్యమాలను పాలకులు అణిచివేతకు పక్కదారి పట్టించడంలో రాజ్యాంగ వ్యతిరేక ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలతో ప్రజలను మరింత భయపెడుతున్నారన్నారు. ఈ పరిస్థితులలో అభ్యుదయవాదులు, ప్రగతిశీల శక్తులు, వామపక్ష, దళిత శక్తులు ప్రజలను ఉద్యమ బాట నడిపించడానికి చట్టబద్ధ రాజ్యాంగ పాలనను గాడిలో పెట్టడానికి లాల్, నీల్ శక్తుల నాయకత్వాలు స్నేహ పూరిత వాతావరణంలో ప్రజలకు విశ్వాసం కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, మనువాదానికి వ్యతిరేకంగా సెక్యులర్ వాతావరణాన్ని పెంపొందించడం ద్వారా సమాజంలో మతసామరస్య వాతావరణాన్ని పెంపొందించడానికి లాల్, నీల్ శక్తులు మైత్రి ఆవశ్యకత ఎంతో అవసరం అన్నారు. ఈ ప్రాధాన్యతను దృష్టిలో పెట్టుకొని ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు అధ్యక్షుడిగా డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు వ్యవహరిస్తారని, ప్రధాన వక్తలుగా నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ అబ్దుల్ నూర్ భాషా, మాజీ ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్సీ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జల్లి విల్సన్, ఉపన్యాసకులుగా ఓపిటిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, న్యాయవాది ముప్పవరపు కిషోర్, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ పీకే రాజేశ్వరరావు ఆధ్వర్యంలో తెలిపారు. ఈ సదస్సుకు వామపక్షవాదులు, అంబేద్కర్ వాదులు, అభ్యుదయవాదులు, ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు, సంత వేలూరి కోటేశ్వరరావు, మిడసల మల్లికార్జునరావు, అంగలకుర్తి ప్రసాద్, కొమ్మినేని హరీష్ చక్రవర్తి, మల్లికార్జున రావు, భీమవరపు సుబ్బారావు, ఎం సుబ్బారావు, సత్యనారాయణ, డి.సింగయ్య, సాంబమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో కె.అగ్రహారం

- సక్రమంగా వెలగని వీధిదీపాలు
- పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్న అధికారులు

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలోని కె.అగ్రహారం గ్రామంలో వీధిదీపాలు వెలగడం లేదని ఇది ప్రజలకు ఇబ్బంది కలిగిస్తుందని అధికారులు ఈ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. కొన్ని ప్రాంతాలలో దీపాలు వెలగకపోవటంతో రాత్రి వేళలో ఇబ్బందికర పరిస్థితులు నెలకొన్నాయని, దొంగతనాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శివాలయం సెంటర్లో వీధిలైట్లు వెలగపోవటంతో ఎప్పుడు ఏమి జరుగుతుందో అని స్థానికులు భయ భ్రాంతులు చెందుతున్నారు. వీధులలో దీపాల నిర్వాహణ అస్తవ్యస్తంగా ఉంది ఎప్పుడు లైట్లు వెలుగుతాయో ఎప్పుడు ఆరిపోతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. రాబోయే రోజుల్లో వానలు ఎక్కువగా ఉంటాయని సాయంత్రం వేళన పాములు, తేళ్ల లాంటి విష పురుగులు బయటికి వస్తున్నాయి. రాత్రి సమయంలో వీధి దీపాలు కూడా వెలగకపోవడంతో ఇండ్ల నుండి బయటకు వెళ్లాలంటే గ్రామ ప్రజలు జంకుతున్నారు. కావున సంబంధించిన అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోని వీధిదీపాలు సకాలంలో వెలిగేలా చూడాలని గ్రామంలోని ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యపు గుంతలతో మూగజీవాల ప్రాణాలకు ప్రమాదం

విశాలాంధ్ర-పీసీపల్లి : విద్యుత్ శాఖ అధికారుల పనితీరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మూగజీవాల ప్రాణాలకి ప్రమాదాలు ఏర్పడుతున్నాయి. వివరాల్లోకి వెళితే... మండలంలోని పెద అలవలపాడు నుంచి పీసీపల్లి వెళ్లే మార్గంలో నేరేడుపల్లి అడ్డరోడ్డు వద్ద విద్యుత్ కాంట్రాక్టర్ స్తంభాల ఏర్పాటు కోసం రైతు పొలాల్లో గుంతలు తీసి పూడ్చి వేయకుండా వదిలేయడంతో ఓ గేదె గుంతలో పడి ప్రాణాలతో విలవిలలాడింది... అటుగా వెళ్లిన స్థానికులు చూడడంతో తాడు సహాయంతో గేదెను అతి కష్టం మీద బయటకు తీశారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు చొరవ తీసుకొని నిర్లక్ష్యంగా ఉన్న గుంతలను పూడ్చివేసి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా సహకరించాలని స్థానికులు కోరుచున్నారు.

దిగజారుతున్న నువ్వుల ధరలు

ఆందోళనలో అన్నదాతలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఈ ఏడాది ఖరీఫ్‌లో నువ్వులు పంట సాగుచేసిన రైతు లకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారు. సకాలంలో వర్షాలు పడడంతో ఖరీఫ్‌లో రైతులు నువ్వు పంట సాగు చేశారు. పంట దిగుబడి ఉన్నప్పటికీ ధరలు దిగజారుతుండడంతో రైతులు పెట్టిన పెట్టుబడులు రాక ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది నువ్వులు క్వింటా ధర 12000 ధర ఉండగా, ఈ ఏడాది 8 వేలకు పడిపోయింది. ఈ ఏడాది మే,జూన్ నెలలో క్వింటానువ్వులు ధర 10,500 ధర ఉన్నది. ప్రస్తుతం జూలై నెలలో 8000వేలకు పడిపోయింది. కళ్ళు ఎదుటే ధరలు దిగజారుతుండడంతో గిట్టుబాటు ధర లేకపోవడంతో అయోమయంలో పడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చే సమయానికి ధరలు దిగజారుతున్నడంతో రైతులు బావురుమంటున్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా 'దోమకాలు'

విశాలాంధ్ర-పుల్లలచెరువు : కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌గా ఆర్.ఉమ్మడి వారం గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి దోమకాలు వెంకటేశ్వర్లును అధిష్టానం నియమించింది.వైసిపి అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి ఆదేశాలతో ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి.చంద్రశేఖర్ ఆశీస్సులతో మండల కన్వీనర్ పదవి వెంకటేశ్వర్లును వరించింది. మండల కన్వీనర్గా ఎన్నికైన వెంకటేశ్వర్లును వైసిపి నాయకులు, కార్యకర్తలు అభినందించారు.

రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి 13వ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-చీమకుర్తి : రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి 13వ కార్యవర్గ ప్రమాణ స్వీకారం చెరుకూరు వెంకటేశ్వర్లు ఇండోర్ స్టేడియం చీమకుర్తి నందు ఉదయం 10 గంటలకు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా అంబటి వీరారెడ్డి ఇన్స్టిలేషన్ ఆఫీసర్‌గా అన్నె రత్న ప్రభాకర్ రావు, ఇండక్షన్ ఆఫీసర్‌గా రావి అంకమ చౌదరి వ్యవహరించారు. 2025-26 సంవత్సరానికి రోటరీ క్లబ్ ఆఫ్ చీమకుర్తి అధ్యక్షులుగా తొగాటి శ్రీను, కార్యదర్శిగా పారెళ్ళ శ్రీనివాసరావు, కోశాధికారిగా దుద్దు శంకర్రావు, ప్రమాణ స్వీకారం చేయడం జరిగింది. నూతన సభ్యులుగా గుద్దు అనిల్ కుమార్, జీ.ప్రసాద రావును ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ అడ్వాన్స్ క్యాన్సర్ మెడికల్ క్లీనింగ్ టెస్టును మెగా మెడికల్ క్యాంపును ఏర్పాటు చేస్తామని మన అసిస్టెంట్ గవర్నర్ పరిధిలోని ఐదు మండలాల పరిధిలోని ప్రజలకు అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. 7,8 తరగతి చదివే ఏడుగురు విద్యార్థినులకు సైకిల్ పంపిణీ, ఎస్ కె ఆర్ బదిరుల పాఠశాల ఉపాధ్యాయులకు నలుగురికి ట్రై సైకిల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు చెరుకూరి రఘు కిరణ్, గవర్నర్ స్పెషల్ ఎయిడ్ బసవ రాములు, ఏఎంసీ మద్దిపాడు అధ్యక్షులు మన్నం ప్రసాద్, మాజీ అధ్యక్షులు యడ్లపల్లి రామబ్రహ్మం, పూనాటి వెంకట్రావు. గొల్లపూడి చౌదరి, గొల్లపూడి వెంకట్రావు, పోకూరి రామకృష్ణారెడ్డి, పోకూరి తిరువెంగళం, సెక్రటరీలు పరాంకుశం శ్రీనివాసమూర్తి, మార్ల తిరుపతిరెడ్డి, నాగండ్ల సత్యం, మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్రపు రాఘవరావు, మున్సిపల్ కమిషనర్ వై. రామకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో అభ్యాసన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

ఎంఈఓ-2 బి.నరసింహారావు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : విద్యార్థులలో కనీస అభ్యాసన ఫలితాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-2 బరిగా నరసింహారావు పేర్కొన్నారు. శనివారం మండలంలోని పెదారికట్ల, గొట్లగట్టు ఉన్నత పాఠశాలలో జరిగిన క్లస్టర్ సమావేశాల ను పర్యవేక్షించి ఈ సందర్భంగా మాట్లాడారు. అకాడమిక్ అంశాలు అడ్మినిస్ట్రేషన్ అంశాలను గురించి ఉపాధ్యాయులకు వివరించి పలు సూచనలు సలహాలు చేశారు. క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు పద్మావతి ఆదినారాయణ, ఆయా క్లస్టర్ పరిధిలోని ప్రాథమిక ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు సిఆర్పిలు పాల్గొన్నారు.

'శ్రీరామ్' ఆధ్వర్యంలో ఉచిత వైద్యసేవలు



విశాలాంధ్ర-ఒంగోలు : కొత్తపట్నం మండలం అల్లూరు గ్రామంలో ఆదివారం మండపం సెంటర్లో డాక్టర్ చాపల వంశీకృష్ణ మిత్ర బృందం అల్లూరు వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ తెలియజేశారు. ఈ వైద్య శిబిరానికి టూ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మేడా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మెడా శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ చాపల వంశీకృష్ణ తనకు ఎంతో ఆత్మీయుడని, పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తూ ఎంతోమందికి సేవ చేస్తూ, వైద్య పరంగానే కాకుండా పేద విద్యార్థుల విద్యాభివృద్ధి కొరకు కృషి చేస్తున్నారని తెలియజేశారు. డాక్టర్ చాపల వంశీకృష్ణ మాట్లాడుతూ అల్లూరు గ్రామం తనకు ఎంతో ప్రత్యేకమైనదిగా భావిస్తానని, ఇక్కడ వారు ఎంతోమంది కొత్తపట్నం హైస్కూల్లో చదువు కున్నారని, వారిలో తన స్నేహితులు, సీనియర్లు జూనియర్లు ఉన్నారని, ఈ గ్రామ ప్రజలు తనను తమ సొంత కుటుంబ సభ్యుని లాగా పరిగణిస్తారని, ఎంతో ప్రత్యేకమైన అనుబంధం కలిగి ఉందని తెలియజేశారు. అప్పటినుండి ఇప్పటివరకు అనుబంధం కొనసాగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా అల్లూరు గ్రామ ప్రజలకు ఈ ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న వారికి శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు నెలరోజులపాటు ఉచిత ఓపి, పరీక్షలపై రాయితీ ఇవ్వబడుతుందని తెలియజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 320 మందికి ఉచితంగా ఓపి, బిపి, షుగర్, ఈసీజీ, పాదాల నరాల స్పర్శ పరీక్ష లు ఉచితంగా చేసి మందులు కూడా ఉచితంగా అందించారు.ఈ ఉచిత వైద్య శిబిరానికి సహాయ సహకారాలు అందించి విజయవంతం చేసిన డాక్టర్ చాపల వంశీకృష్ణ స్నేహ బృందం శాంతారావు, తిరుమలేశ్వర్ రావ్ బెంగళూరు జాలయ్య, వేణు, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం హరిబాబు ప్రసాదు, ఆరుమూరి శ్రీనుకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ వైద్య శిబిరంలో ప్రముఖ ప్రసూతి, స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ చాపల శాంత కుమారి, ప్రముఖ జనరల్, ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ సానల ధీరజ్ బాబు, ప్రముఖ మెదడు, వెన్నుముక శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ షేక్ వలి బాబు, ప్రముఖ జనరల్ అండ్ లాప్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ దోనే సృజన్, జనరల్ వైద్య నిపుణులు డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ నందలూరు సరయు, జనరల్ మేనేజర్ బైరెడ్డి ప్రవీణ్ కుమార్, మార్కెటింగ్ మేనేజర్ షేక్ ఖాసిం సైదా, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు గోపి, అనిల్, రజనీకాంత్ మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఉగ్రకు సన్మానం

విశాలాంధ్ర-వెలిగండ్ల : మండలంలోని సింగిల్ విండో డైరెక్టర్‌గా నియమితులు కాబడిన యద్దనపూడి సాల్మన్ రాజ్, వెలిగండ్ల టిడిపి నాయకులు ఆదివారం కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డిని అమరావతి గ్రౌండ్స్ నందు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కొరకు నిరంతరం కృషి చేసిన ప్రతి కార్యకర్తకి తగిన ప్రాధాన్యత ఎమ్మెల్యే ఇవ్వటం జరుగుతుందని తెలియజేశారు అనంతరం ఎమ్మెల్యే ముక్కు పెద్దిరెడ్డి, యద్దనపూడి సల్మాన్ రాజ్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చిలకల వెంకటేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సోము చౌదారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కసునూరి మౌలాలి, క్లస్టర్ ఇంచార్జ్ కారంపూడి వెంకటేశ్వర్లు, కృష్ణారావు, గౌదకట్ల మాలకొండయ్య, గొరిగే సుబ్రమణ్యం, పరశురాం టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు రొయ్యల రైతుల ధర్నా

విశాలాంధ్ర -ఒంగోలు : ఈనెల 21వ తేదీన ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ఉమ్మడి ప్రకాశం జిల్లా రొయ్యల రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శాంతియుత ధర్నా నిర్వహిస్తున్నట్లు సంఘం గౌరవ అధ్యక్షులు మారినేని వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ. 1.50 యూనిట్ విద్యుత్ ధరను ఆక్వా, నాన్నకువ జూన్ అనే తేడా లేకుండా అన్ని చెరువులకు వెంటనే అమలు చేయాలని, 2019 కి ముందు ఇచ్చిన విధంగా ఉచితంగా ట్రాన్స్ఫార్మర్లు రైతులకు మళ్ళీ ఇవ్వాలని, కిలో రూ.9 మేరకు ఆక్వా ఫీడ్ ధర తగ్గింపును ప్రభుత్వ ప్రకటన ప్రకారం జూలై నుండి అమలు చేయాలని, కరోనా తర్వాత బహుగుణంగా పెరిగిన ఆక్వా కెమికల్స్ ధరలు తగ్గించాలని, టైగర్ ప్రాన్లకు మద్దతు ధర అమలు చేయాలని, వైష్ణవి, మోనా వంటి హేచరిలను పర్యవేక్షిస్తూ నాణ్యమైన రొయ్యల లార్వా అందించాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు సమస్యలపై ధర్నా నిర్వహించడం జరుగుతుందని, ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని రొయ్యల రైతులు విరివిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రైతులకు వర్షంతో ఉపశమనం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాలలో ఆదివారం సాయంత్రం వర్షం కురిసింది. ఉదయం నుంచి తీవ్రమైన ఎండతో ఇబ్బంది తలెత్తింది. మధ్యాహ్నం నాలుగు గంటల సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని సుమారు గంట పాటు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండలు తీవ్రంగా పెరగడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అయ్యారు. దీంతో ఆదివారం కురిసిన వర్షానికి వాతావరణం చల్లబడి వృద్ధులు, చిన్నపిల్లలు ఉపశమనం పొందారు. అద్దంకి దర్శి ప్రధాన రహదారిలో ముళ్ళమూరు బస్టాండ్ సెంటర్లో వర్షపు నీరు నిలిచిపోయింది. పాదాచారులు, వాహన చోదకులు కొంత ఇబ్బంది పడ్డారు. ఈ వర్షం ఖరీఫ్ సీజన్ కు ఉపయోగమని రైతులు తెలుపుతున్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు

విశాలాంధ్ర-టంగుటూరు : గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలని గ్రంధ పాలకులు గుమ్మడి వర్ధనరాజు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం నాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమకు నచ్చిన పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని నింపుకున్నారు. అదే విధంగా గ్రామంలోని ప్రతి విద్యార్థులను తమ తల్లిదండ్రులు గ్రంథాలయానికి పంపించిన విజ్ఞానవంతులుగా చేయాలని గ్రంధ పాలకులు గుమ్మడి వర్ధనరాజు కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్

విశాలాంధ్ర-టంగుటూరు : మండలంలోని బుచ్చిరాజుపాలెం సమీపంలోని చిల్లచెట్లలో పేకాట ఆడుతున్న ఏడు మందిని పట్టుకున్నట్లు ఎస్ఐ వి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు ఒంగోలు డిఎస్పి రాయపాటి శ్రీనివాసరావు మరియు సింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్య పర్యవేక్షణలో టంగుటూరు ఎస్సై వి.నాగమల్లేశ్వరరావు డ్రోన్ సహాయంతో పేకాట ఆడుతున్నట్లు వారిని గుర్తించి అరెస్ట్ చేయడం జరిగిందని ఎస్ఐ తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని డ్రోన్ సహాయంతో పట్టుకొని వారిని కట్టడి చేస్తామని మరియు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూములు పరిశీలించిన డీఆర్‌డీఓ ప్రతినిధులు

విశాలాంధ్ర-దొనకొండ:
బెంగుళూరులోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్డీఓ)కు చెందిన ప్రతినిధులు స్థానిక బాదాపురంలోని ప్రభుత్వ భూములను ఆదివారం పరిశీలించారు. డిఆర్డీఓలో బ్రహ్మోస్ క్షిపణి తయారీ విభాగానికి చెందిన ఇద్దరు ప్రతినిధులకు కనిగిరి ఆర్డీఓ జి.కేశవర్ధనరెడ్డి బాదాపురంలోని రెండు వేర్వేరు ప్రభుత్వ ఖాళీ భూములను చూపించి, మ్యాపుల ద్వారా క్షుణ్ణంగా వివరించారు. సుమారు 100 నుండి 400 ఎకరాల భూమి అవసరం ఉంటుందని, ప్రాథమిక సర్వేలో రెవెన్యూ సిబ్బంది అందించే సమగ్ర విషయాలను పరిగణలోకి తీసుకుని, అందులో తమకు అనువైన అంశాలను బట్టి తదుపరి సర్వే ఉంటుందంటూ వారు తెలిపినట్లు సమాచారం. అనంతరం స్థానిక విమానాశ్రయాన్ని వారు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేవలం ప్రాథమిక సర్వేలో ఉన్నందున ప్రతినిధుల పేర్లు, ఇతర వివరాలను మీడియాకు వెల్లడించేందుకు వారు విముఖత చూపారు. ఆర్డీఓ జి.కేశవర్ధనరెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్ మోహన్, సర్వేయర్ అనిల్, ఏపీఈడీబి అధికారి ఐశ్వర్య, తహసీల్దార్ బి.రమాదేవి, డీటీ కెవి.నాగార్జునరెడ్డి, లైసెన్స్ సర్వేయర్ సిహెచ్.వెంకట్రావు తదితరులున్నారు.

లాల్ నీల్ మైత్రి సదస్సును విజయవంతం చేయండి

జిల్లా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్

విశాలాంధ్ర - కనిగిరి : లాల్ నీల్ మైత్రి సదస్సును విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి పందిటి మోహన్ కోరారు. శనివారం కనిగిరిలోని దర్శి చెంచయ్య భవన్ నందు ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు దళిత ప్రజానీకం గమనిస్తున్నారని దళితుల ఐక్యత ఆవశ్యకత పై ఆలోచించాలని మేధావులు రాబోయే తరాలకు మార్గాన్ని ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందని నేడు ప్రజలు జీవన పోరాటంలో పడి రాజకీయ చైతన్యాన్ని కోల్పోతున్నారని అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పొలిటికల్ ఈజ్ మాస్టర్ కి అన్నారు. కానీ నేడు దళిత బహుజన ప్రజలు ఆవైపుగా ఆలోచించడంలో విఫలం చెందారని అన్నారు. రాజకీయంగా దళిత బహుజనులు ఎదగాలని అందులో భాగంగానే లాల్ నీల్ మైత్రి సదస్సును ఒంగోలులోని సిపిఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్ నందు ఈనెల 24వ తేదీ గురువారం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సభ అధ్యక్షులు డిహెచ్పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, ప్రధాన వక్తలు అబ్దుల్ నూర్ భాషా (రిటైర్డ్ ప్రొఫెసర్ నాగార్జున యూనివర్సిటీ), జల్లి విల్సన్ మాజీ ఎమ్మెల్సీ, ఉపన్యాసకులు చావలి సుధాకర్ ఓపిడిఆర్ రాష్ట్ర అధ్యక్షులు, ముప్పవరపు కిషోర్ న్యాయవాది, పీకే రాజేశ్వరరావు ఆంధ్ర బ్యాంక్ మాజీ మేనేజర్ లను ఆహ్వానించడం జరుగుతుందని మేధావులు దళిత ప్రజా సంఘాల నాయకులు విచ్చేసి తమ అమూల్యమైన సందేశాన్ని ఇచ్చి పై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఇమామ్‌ల సమస్యను పరిష్కరించాలి

విశాలాంధ్ర-గిద్దలూరు :
ఇమాముల సమస్యలను పరిష్కరించాలని ముస్లిం మైనార్టీల సంఘం నాయకులు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డిని కోరారు. ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న ఇమామ్ మౌజన్ల సమస్యలను పరిష్కారం చేయాలని, అలాగే నూతనంగా వేతనాల కొరకు దరఖాస్తులు చేసుకున్న ఇమామ్ మౌజనులకు వేతనాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వేతనాలను మంజూరు చేయించాలని వినతి

పత్రం అందచేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ఇమామ్, మౌజామ్‌ల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నియోజకవర్గ ముస్లిం మైనారిటీ అభివృద్ధి సంక్షేమ సంఘం అధ్యక్షులు గుడిసె మహబూబ్ బాషా మరియు ముస్లిం మైనారిటీ నాయకులు రఫీ షబ్బీర్ ఖాసీం మహబూఖాన్ దాదా పీర్ ఇబ్రహీం గఫార్ గోల్కొండ చాంద్ బాషా నూరుల్లా నాగూర్ దస్తగిరి పేరయ్య మోదిన్ మరియు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల మసీదు పెద్దలు పాల్గొన్నారు.

గొర్రెలు,మేకల మేతకు ప్రభుత్వ భూములు కేటాయించాలి

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : గొర్రెలు మేకల మేత నిమిత్తం ప్రభుత్వ భూములు కేటాయించాచలని ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పూసపాటి వెంకటరావు జిల్లా కార్యదర్శి తోట తిరుపతరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలం ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం నాగులుప్పలపాడు మండల మహాసభ ఉప్పుగుండూరులో యాదవ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించారు. ఈ సభకు గ్రామ గొర్రెల సహకార సంఘం అధ్యక్షులు భాస్కరరావు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఆసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకట్రావు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా కాపర్లను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేసారు ప్రధానంగా గ్రామాల్లో ఈ సీజన్లో పంటలు వేసిన తర్వాత మేత వనరులు నిలబెట్టుకోవడానికి జాగాలు లేక కాపర్లు పలు ఇబ్బందులు పడుతున్నారని డొంకలు, దారులు, కుంటలు ఆక్రమణలకు గురి కావడం వలన జీవాలకు మేత కొరత తీవ్రంగా ఏర్పడుతుందన్నారు దీని వలన పెంపకం దారులు అనేక దూర ప్రాంతాలకు వలసలు పోయి రోడ్డు ప్రమాదాల బారిన పడడంతో పాటు పాము కాటు పిడుగులు పాట్లకు గురై మరణిస్తున్నారని తెలిపారు జిల్లా కార్యదర్శి తోట తిరుపతిరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గొర్రెల కాపరుల కు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు ఉప్పుగుండూరు మేజర్ పంచాయితీ అని సుమారు 5000 వేల గొర్రెలు వందలాది పశువులు ఉన్నా ఇక్కడ పశువైద్యశాలలో సీనియర్ డాక్టర్ లేనందువలన వైద్యం సరిగా అందడం లేదన్నారు. ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ పశువుల హాస్పటల్ స్థాయి ని పెంచి డాక్టర్ ను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే గొర్రెల బీమా సౌకర్యాన్ని గురించి ప్రభుత్వం ప్రచారమే తప్ప ఆచరణలో పథకాన్ని సరిగా అమలు చేయడం లేదన్నారు ప్రభుత్వమే ఉచితంగా భీమ చేయించి పదివేలకు తగ్గకుండా నష్టపరిహారం ఇవ్వాలన్నారు. 90 శాతం సబ్సిడీతో షెడ్లు అందరికీ ఇవ్వాలని 50 సంవత్సరాలకే 5000 రూపాయలు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ప్రతి కాపరికి 50 శాతం సబ్సిడీతో రుణ సౌకర్యం కల్పించి తద్వారా వృత్తి రక్షణ వృత్తిదారుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు అనంతరం నూతన కమిటీ ఎన్నుకున్నారు అధ్యక్ష కార్యదర్శులుగా నక్కల శ్రీకాంత్, కొనికి రాఘవను కమిటీ సభ్యులుగా మనిముక్కు భాస్కరరావు,భట్టు వెంకట్రావు ఈర్ల మహేష్, కొండపి నాగరాజు, వీరభద్రయ్య మసనం శివయ్య, అత్తింటి అంజయ్య, గుమ్మా వెంకట్రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కాకాని సుబ్బారావు, రజక వృత్తిదారుల సంఘం కళ్ళకుంట శ్రీనివాసరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఉప్పుగుండూరు వెంకటేశ్వర్లు వివిధ గ్రామాల గొర్రెల కాపర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ-2 హాస్టల్‌ను కొనసాగించాలని నిరసన

విశాలాంధ్ర - కనిగిరి : కనిగిరిలో ఉన్న ఎస్సీ2 హాస్టల్ ను కనిగిరిలోనే కొనసాగించాలని దళిత ప్రజా సంఘాలు శనివారం ఒంగోలు బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి అధికారులు ఎస్సీ -2 హాస్టల్ను ఇక్కడ నుండి వెలిగండ్ల మండలం పందువ నాగులవరానికి తరలించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందుతున్నందున ఆ ప్రయత్నాన్ని విరమించుకొని ఎస్సీటు హాస్టల్‌ను కనిగిరిలోనే యధావిధిగా కొనసాగించాలని ప్రస్తుతం లాగిన్ ఆపి ఉన్నందున దానిని ప్రారంభించి అప్లికేషన్లు ఆన్లైన్ చేయాలని కోరారు దళితులు విద్య పరంగా అభివృద్ధి చెందకుండా ఉండేందుకు ఇటువంటి ప్రయత్నాలు సరికాదని పాలకులు దళితుల అభివృద్ధికి పాటుపడాలని కోరారు ఈ కార్యక్రమంలో రాచపుడి మాణిక్యరావ్ మున్సిపల్ వైస్ చైర్మన్, చదలవాడ బాల గురవయ్య అంబేద్కర్ ధర్మ పోరాట సమితి రాష్ట్ర నాయకులు, కటికల వెంకటరత్నం నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు, శివ కాశయ్య, మాజీ బి టి ఏ రాష్ట్ర నాయకులు, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎడ్వర్డ్ సాల్మన్ రాజ్, మాల జేఏసీ జిల్లా నాయకులు శాంతరాజు, చీమలదిన్నె వెంగయ్య, స్వర్ణ బాబు, పందిటి మోహన్ దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి, బిసి ఐక్యవేదిక నాయకులు పల్లా మాలకొండ రావు నాయకులు మాజీ సింగిల్ విండో అధ్యక్షులు కాకర్ వెంకటేశ్వర్లు, తాతపూడి సురేష్ బాబు సర్పంచ్ వెలిగండ్ల, పూలే సేవా సమితి నాయకులు దేపూరు వెంకటేశ్వర్లు, లైబ్రేషన్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ దమ్ము కేశవులు, దమ్ము వెంకటయ్య సర్పంచ్ ఏరువారి పల్లి, కటికల అగస్టీన్, నాయి బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు చెరుకూరి కాశయ్య, ఆవుల మంద వెంకటేశ్వర్లు రజక సంఘం కనిగిరి టౌన్ నాయకులు, కొటికల బ బాలబాదుర్ల మాల జేఏసీ జిల్లా నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పవన్ కళ్యాణ్, ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు పుట్ట సుబ్బారావు, మండల ఏఐఎస్ఎఫ్ అధ్యక్షులు ఇఫ్రాజ్, కృష్ణార్జున, తదితరులు పాల్గొన్నారు.

శ్రీ నారాయణస్వామికి పూజలు

విశాలాంధ్ర-సి ఎస్ పురం : జిల్లాలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థాన లో నారాయణస్వామికి అత్యంత పవిత్రమైన రోజైనా ఆదివారము స్వామివారికి భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారి అభిషేక విగ్రహానికి గోపూజ, అభిషేకం అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భముగా అర్చకులు మంకాళ ప్రసాద్ శర్మ పంచామృతాలతో స్వామివారి మూల విరాట్ మరియు శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను అభిషేకం పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరణ చేసి శ్రీ నారాయణ స్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహ బాబు, శ్రీ నారాయణ స్వామి దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రోటరీ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర - వేటపాలెం : సమాజంలో అవసరాలను గుర్తించి సేవలందించడంలో రోటరీ ముందంజలో ఉందని, సేవకు ప్రతిరూపం రోటరీ సంస్థ అని రోటరీ 3150 డిస్ట్రిక్ట్ పూర్వపు గవర్నర్ పి. శివన్నారాయణ తెలిపారు. వేటపాలెం రోటరీ క్లబ్ 2025-26 సంవత్సర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో ఆదివారం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులుగా ఏవీ. సురేష్ బాబు రెండోసారి, కార్యదర్శిగా అక్కల చంద్ర శేఖర్ రెడ్డి, కోశాధికారిగా రొండా దశరథరా మిరెడ్డి నియమితులు కాగా ఫాస్ట్ గవర్నర్ శివన్నారాయణ ఇన్స్టలేషన్ అధికారిగా అధ్యక్ష, కార్యదర్శులచే ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలను అప్పగించారు. నూతన సభ్యులు అయిన పోలకం చంద్రశేఖర్‌కు రోటరీ పిన్ అందించి క్లబ్‌లోకి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేటపాలెం రోటరీ క్లబ్ సేవలు అభినందనీయమని, క్లబ్ పురోభివృద్ధికి తోడ్పడి సభ్యులను పెంచాలని, సేవాభావం కలిగిన వారు క్లబ్ సభ్యులుగా చేరాలని అన్నారు. గ్రామానికి చెందిన పల్లపోలు నాగమనోహర్ లోహియా తన శరీరాన్ని మరణానంతరం రోటరీకి దానం చేస్తున్నట్లు సభాముఖంగా తెలియజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు, అన్యువల్ గివింగ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ కెఎస్ఆర్‌కె. ప్రసాద్, ఛార్టెడ్ ప్రెసిడెంట్ గొల్లపూడి సీతారాం, ఏవీ. సురేష్ బాబు, ఏ. చంద్రశేఖర్ రెడ్డి, కొత్త 5జి శ్రీనివాసరావు (వాసు), కె. శివరామకృష్ణ, ప్రత్తి వెంకట సుబ్బారావు, బట్ట మోహనరావు, పి. శ్రీనివాసరావు, పి. చంద్రశేఖర్, ఊట్ల వెంకటేశ్వర్లు, దివి పవన్, ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఆడి కృత్తిక పూజలు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల నల్లగాంధీ బొమ్మ కూడలి వద్ద ఉన్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వర స్వామి వారి ఆలయం లో కొలువై ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆడి కృత్తిక 66వ వార్షిక మహోత్సవాన్ని అర్చకులు దివాకర శర్మ, భాస్కర శర్మ, జగదీష్లు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ద్రవ్యాభిషేకాలు శాస్త్రోక్తంగా నిర్వహించి దీపోత్సవం చేశారు. అనంతరం భక్తులకు దివ్య దర్శనం కల్పించారు. సాయంత్రం దేవేరులకు, స్వామి వారికి కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుమంగళ వాయిద్యాల మధ్య, భక్తుల జయజయ ధ్వానాలతో, వేదమంత్రోచ్చారణలతో 158 దంపతుల చేత వైభవంగా నిర్వహించారు. విశేషంగా హాజరైన భక్తులకు, మహిళలకు కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కన్నుల పండుగగా జరిగిన ఈ ఉత్సవంలో కళ్యాణ అక్షతలు తీసుకునేందుకు భక్తులు బారులు తీరారు.

అవోపా ఆధ్వర్యంలో చదువుల పండుగ

విశాలాంధ్ర - చీరాల టౌన్ : కిరాణా మర్చంట్స్ కళ్యాణమండపం నందు చీరాల ఆర్యవైశ్య అఫిషియల్స్ అండ్ ప్రొఫెషినల్ అసోషియేషన్ (అవోపా)లో ఆదివారం జరిగిన చదువుల పండుగ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాల కొండయ్య పాల్గొన్నారు. చదువుల పండుగలో 109 మంది విద్యార్థులకు రాష్ట్రస్థాయి ప్రతిభ పురస్కారాలు, 80 మంది విద్యార్థులకు వడ్డీలేని విద్యా రుణాలు 64 మంది విద్యార్థులకు ఉచిత చేయూత పురస్కారాలు, 40 మందికి వడ్డీలేని ఉపాధి రుణాలు వీటితో పాటు వడ్డీలేని రుణంగా ఐదుగురు విద్యార్థులకు ల్యాప్టాప్ కంప్యూటర్లు మొత్తం 250 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు దాదాపు రూ.25 లక్షల విలువైన సహాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో భవిష్యత్తులో చేస్తారని ఆశిస్తూ తమ వంతు సహకారం ప్రోత్సాహం అందిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సుబ్బయ్య,కొత్తమాసు శివ రంగనాయకులు,మువ్వల వెంకట రమణారావు,బొలిశెట్టి మురళీకృష్ణ,బొలిశెట్టి రమేష్ కుమార్,పోలిశెట్టి ప్రేమ్ కుమార్,అవోపా వలివేటి మురళీకృష్ణప్రెసిడెంట్ పోలిశెట్టి శ్యామసుందరరావు, సెక్రటరీ పేర్ల వెంకటరామయ్య, ట్రెజరర్ విద్యార్థి తల్లిదండ్రులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారం

విశాలాంధ్ర - సంతమాగులూరు : స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛత దివస్ లో భాగంగా గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేదుకు గ్రీన్ అంబాసిడర్ల (పారిశుధ్య కార్మికులు) పాత్ర కీలకమైందని ఎంపీడీవో జ్యోతిర్మయి అన్నారు. ఆదివారం కామేపల్లి పంచాయతీలో సర్పంచ్ గుండపనేని సురేష్ అధ్యక్షతన కార్మికులకు పారిశుధ్య కిట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా గ్రామంలో పారిశుధ్యం మెరుగు కోసం వారు చేస్తున్న సేవలను అభినందిస్తూ శాలువాలతో సన్మానించారు. టీడీపీ నేతలు గాడిపర్తి రాంబాబు, గాడిపర్తి రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రతి ఒక్కరి జ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు చక్కటి వేదిక గా నిలుస్తున్నాయని గ్రంథ పాలకుడు బాదం విజయ భాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం మండల కేంద్రం సంతమాగులూరులో 'చదవడం మాకిష్టం' కార్యక్రమం నిర్వహించారు. చుట్టుపక్కల నుంచి 18 మంది బాల బాలికలు పాల్గొన్నారు. వారికి లైబ్రరీలో ఉన్న కథలు, మహనీయులు జీవిత చరిత్ర పుస్తకాలను పరిచయం చేశారు. సామాజిక, ఇతరత్రా అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వారిచేత పుస్తక పఠనం చేయించారు.

సంతమాగులూరులో భారీ వర్షం

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో తేలికపాటి వర్షం కురిసింది. మూడు గంటల సమయంలో వాతావరణం చల్లబడింది. ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై వర్షపు జల్లులు పడ్డాయి. సుమారు అరగంటకుపైగా ఎడతెరిపి లేకుండా గట్టి జల్లులు పడ్డాయి. ఈ సమయంలో బలమైన ఈదురు గాలులు వీయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 1.30 గంటల వరకు కూడా నిప్పుల కుంపటి తలపించేలా ఎండా వేడిమితో ఉక్కపోతకు గురైన ప్రజలు.. వాన రాకతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఉపశమనం పొందారు. మండలం పరిధిలోని పుట్టావారిపాలెం, కొమ్మాలపాడు, వెల్లలచెరువు, కామేపల్లి, మిన్నెకల్లు, మక్కెనవారిపాలెం, కుందుర్రు తదితర ప్రాంతాల్లో వర్షం పడిందని స్థానికులు పేర్కొన్నారు. అలాగే ఏల్చూరు వద్ద నామ్ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడు బ్రేకర్లు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షానికి నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయంలో నామ్ హైవే అధికారులు స్పందించి, గుంతలకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

అద్దంకిలో భారీ వర్షం

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మండలంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మండలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సాయంత్రం వాతావరణం చల్లబడి ఉరుములు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఖరీఫ్ సాగుకు సమాయత్తమవుతున్న తరుణంలో భారీ వర్షం కురవడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చిరుజల్లులతో చల్లబడిన వాతావరణం

విశాలాంధ్ర - యద్దనపూడి : గత పది రోజుల నుండి వేస్తున్న వేడి గాలులతో అల్లాడిపోయిన ప్రజలకు పడిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఏడాది మే నెలలో వర్షాలు ఎక్కువగా పడటం అప్పుడు వాతావరణం చల్లబడింది. జులై నెలలో గత కొద్ది రోజుల నుండి వీస్తున్న వేడి గాలులకు ప్రజలు వేడిగాలి తో అల్లాడిపోయారు .గ్రామాల్లో రైతులు కూడా పంటలను సాగు చేసేందుకు పొలాల ను దున్ని విత్తనాలను నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ వర్షంతో రైతులు పత్తి, జుట్టు పంటలు సాగు చేసేందుకు సన్నాహమవుతున్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వరా...?

విశాలాంధ్ర - రేపల్లె : జిల్లా పరిషత్,మండల పరిషత్ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులుబదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లి నెలరోజులు గడిచినప్పటికిని జూన్ నెల జీతాలు ఇంకనూ చెల్లించకపోవడం శోచనీయమని ఏపీ టీచర్స్ ఫెడరేషన్ బాపట్ల జిల్లా శాఖ రాష్ట్ర కౌన్సిలర్ తేలప్రోలు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తగు చర్యలు తీసుకుని ఉపాధ్యాయుల వేతనాలు చెల్లించాలని, పొజిషన్ ఐ.డిలు క్రియేట్ చేయకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తూ వేతన జీవులను ఆందోళనకు గురిచేస్తుందని, ఈ విధానాన్ని విడనాడాలని కోరారు.

23 లోపు రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : అర్హత ఉండి అన్నదాత సుఖీభవ జాబితాలో పేరు లేని రైతులు ఈ నెల 23 లోపు గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద గ్రీవెన్స్ లో పేర్లు నమోదు చేయించుకోవాలని వ్యవసాయ శాఖ అధికారి ఎస్.వి.పి కుమారి అన్నారు.జిల్లాలో వాతావరణ ఆధారిత పంటల భీమా కింద ప్రత్తి పంటకు, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం ద్వారా వరి, మిరప, కంది, మినుము పంటలకు పంటలకు ఫసల్ బీమా పథకం అమలు చేయడం జరుగుతుందన్నారు. వరి పంటకు ఆగస్టు 15 లోపు,మిగిలిన అన్ని పంటలకు ఈనెల 31 లోపు పంటల బీమా ప్రీమియం చెల్లించాలని అన్నారు . బ్యాంకుల ద్వారా పంటలకు రుణం తీసుకునే రైతులు నేరుగా బ్యాంకు లో ప్రీమియం చెల్లించవచ్చని, బ్యాంకులో రుణం తీసుకొని కౌలు రైతులు గ్రామ సహాయకుల వద్ద పంట సాగు పత్రం తీసుకొని కామన్ సర్వీస్ సెంటర్‌లో ప్రీమియం చెల్లించవచ్చన్నారు.పత్తి పంటకు రూ.1900,వరి రూ.800,ఎర్ర మిరప రూ.1800, కంది రూ.400, మిరప రూ.400, చొప్పున ప్రీమియం చెల్లించాలని ఏవో తెలిపారు.

అలకాపురం వైసీపీ అధ్యక్షునిగా చంద్రశేఖర్

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : మండలంలోని అలకాపురం గ్రామ వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షునిగా చల్లపల్లి చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.ఈ మేరకు ఆదివారం అలకాపురం గ్రామంలో మండల ఎంపీపీ దేందుకూరి సీతారామరాజు అధ్యక్షతన అలకాపురం వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షునిగా చల్లపల్లి చంద్రశేఖర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎన్నికైన చల్లపల్లి చంద్రశేఖర్ ను మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ ఉయ్యూరు లీల శ్రీనివాస్ రెడ్డి, మండల యువజన విభాగ అధ్యక్షులు షేక్ మౌలాలి, రాష్ట్ర ఎస్ఎస్ఎల్ నాయకులు మండే విజయ్ కుమార్, అల్లూరు లక్ష్మీ నరసింహా స్వామి ఆలయ మాజీ చైర్మన్ వాలి శివ రెడ్డి, మండే జాన్ బాబు, మార్పు మోషే, చల్లపల్లి దానియేలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సూర్యలంక కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామనగర్ గ్రామంలో ఉచిత మెడికల్ క్యాంప్ విజయవంతంగా నిర్వహించబడినట్లు మెరైన్ సి.ఐ లక్ష్మారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమం కోస్టల్ సెక్యూరిటీ నేతృత్వంలో యజ్ఞ హాస్పిటల్, బాపట్ల వైద్య బృందం సహకారంతో నిర్వహించబడింది. గుండె, స్త్రీల ఆరోగ్యం, ఎముకల నిపుణులు బిపి, డయాబెటిస్, ఈసీజీ వంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందించడమేకాక, ఆరోగ్య అవగాహన కౌన్సెలింగ్ కూడా గ్రామస్తులకు అందించారు. ఈ శిబిరంలో సుమారు 200 మంది గ్రామస్థులు పాల్గొని వైద్య సేవలు పొందినట్లు తెలిపారు. ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని, ఈ తరహా ఆరోగ్య కార్యక్రమాలు పోలీస్ శాఖ పట్ల ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుస్తాయని మెరైన్ సీఐ అన్నారు.

భైరవకోనలో భక్తుల సందడి

విశాలాంధ్ర-సిఎస్ పురం : జిల్లాలోని ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన పర్యాటక కేంద్రమైన భైరవ కోనలో ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పోటెత్తారు. జలపాతంలో స్థానాలు ఆచరించి భైరవల్ కోన్ లోని త్రిముఖ దుర్గాంబ అమ్మవారిని కాలభైరవ స్వామిని దర్శించుకుని పర్యాటకులు భక్తులు పూజలు చేశారు. పామూరు మండలంలోని చింతల పాలెం గ్రామానికి చెందిన కేతు వెంకటేశ్వర్ రెడ్డి ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులును తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించా రు. వెంకటేశ్వర్‌రెడ్డి ఆదిలక్ష్మి కుమారులు వెంకట్రామిరెడ్డి, ఓబుల్ రెడ్డి, వెంకటరమణారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, జయరామిరెడ్డి లు దేవస్థానం అభివృద్ధికి పదివేల నూట పదహారు రూపాయలు ను దేవస్థానం కార్య నిర్వహణ అధికారి వంశీకృష్ణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సి ఎస్ పురం పంచాయతీ కార్యదర్శి వి బ్రహ్మ నందరెడ్డి, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి, దూబగుంట ఉప సర్పంచ్ కందుల శ్రీనివాసులరెడ్డి, గాజులపల్లి వెంకటేశ్వర రెడ్డి, ఆల్ఫా జయ రామిరెడ్డి, చెరుకుపల్లి మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

కలెక్టర్ వద్ద కన్నీరు పెట్టుకున్న రైతు

విశాలాంధ్ర-మార్కాపురం : పెద్దారవీడు మండలం మద్దలకట్ట గ్రామానికి చెందిన రైతు దొడ్డ కోటిరెడ్డి శనివారం మార్కాపురం వచ్చిన కలెక్టర్ తమీమ్ అన్సారియా వద్ద తన బాధను వ్యక్తం చేస్తూ కన్నీటి పర్యంతమయ్యాడు. హైవేపనుల్లో భాగంగా తనకు జీవనాధారమైన పొలాన్ని ప్రభుత్వం భూసేకరణ కింద సెంటుకు 9 వేల రూపాయలే ఇస్తామంటున్నారని, కనీసం 50వేలైనా ఇచ్చి తమను ఆదుకోవాలని కలెక్టర్ కాళ్లుపట్టుకున్నాడు. తన ఆవేదనంతా కన్నీటిరూపంలో కలెక్టరుకు తెలిపారు. ఆ పొలమే తనకు జీవనాధారమని, భూసేకరణలో హైవేరోడ్డు కింద తీసుకుంటే తనకు కుటుంబ పోషణ చాలా కష్టమని తనకు న్యాయం చేయాలని కోరారు. ఈ లోపు కలెక్టర్ వ్యక్తిగత సిబ్బంది, పోలీసులు రైతును సముదాయించారు.

పేకాటరాయుళ్లను వెంబడించిన డ్రోన్...

- 10 మంది పేకాట రాయుళ్ళు అరెస్ట్
- రూ.12100 నగదు, 9 సెల్ ఫోన్‌లు, 4 ద్విచక్ర వాహనాలు సీజ్

విశాలాంధ్ర - బాపట్ల : అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలను కట్టడి చెయ్యాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జిల్లా పోలీస్ అధికారులను ఆదేశించారు. పేకాట, ఇతర అసాంఘిక చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగడానికి అవకాశం ఉండే ప్రదేశాలను డ్రోన్‌లను వినియోగించి గుర్తించి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇంకొల్లు ఎస్ఐ సురేష్ ఆదివారం డ్రోన్‌లను వినియోగించి ఇంకొల్లు పోలీస్ స్టేషన్ పరిధి లోని గంగవరం గ్రామ పొలాలలో కొందరు పేకాట ఆడుతున్నారని గుర్తించారు. వెంటనే తన సిబ్బందితో ఎస్ఐ వేగంగా ఆ ప్రదేశానికి చేరుకుంటుండగా, పోలీసులరాకను పసిగట్టిన పేకాట రాయుళ్ళు అక్కడ నుండి పారిపోయేందుకు యత్నించారు. పారిపోతున్న వారు ఎటు వెళుతున్నారో డ్రోన్ సహాయంతో గుర్తించిన ఎస్ఐ వారి సిబ్బంది డ్రోన్ ద్వారా వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. పేకాట ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ.12100 నగదు, 9 సెల్ ఫోన్ లు సీజ్ చేశారు. పేకాట స్థావరం వద్ద ఉన్న 4 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ప్లాస్టిక్ నిషేధం అత్యవసరం

డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర-మార్కాపురం : స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధించాలంటే ప్లాస్టిక్ నిషేధం అత్యవసరమని బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి అన్నారు. ప్లాస్టిక్ వాడకం విషయలో ప్రజలు మేల్కొనాలని,పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకంతో వాతావరణం తీవ్రంగా కలుషితమవుతోందని, గృహాలు, కాలనీలు, డ్రైనేజీ వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. నిషేధిత ప్లాస్టిక్ పదార్థాలు మాత్రమే కాకుండా, ఒకసారి వాడేసి పారేసే ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగాన్ని కూడా పూర్తిగా నియంత్రించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ వాడకంతో ముఖ్యంగా మైక్రో ప్లాస్టిక్ ద్వారా మన ఆహారంలోకి హానికరమైన రసాయనాలు చేరే ప్రమాదం ఉందన్నారు. దాంతో క్యాన్సర్ వంటి తీవ్రమైన రోగాలు వస్తాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడకం వలన డ్రైనేజీ వ్యవస్థలు మూసుకుని వరదలు తలెత్తే ప్రమాదం ఉందని, అలాగే ప్లాస్టిక్ అనేది నేల, నీటి వనరుల్ని కలుషితం చేస్తుందని చెప్పారు. ప్లాస్టిక్ తినడం వల్ల పశువులు, పక్షులు మరణిస్తున్నాయని డాక్టర్ ఏలూరి ఆవేదన వ్యక్తం చేశారు.ప్లాస్టిక్ నిషేధం విషయంలో ప్రజలందరూ ప్రభుత్వానికి బాసటగా నిలవాలని ఆయన కోరారు.

అలాగే ప్లాస్టిక్ నిర్మూలనకు నిబంధనలు పెట్టడమే కాకుండా, వాటిని కఠినంగా అమలు చేయాలని, మరోవైపు ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని డాక్టర్ ఏలూరి సూచించారు. ప్లాస్టిక్ నిషేధం ఒక్క ప్రభుత్వ బాధ్యత కాదు, ప్రతి ఒక్క పౌరుని ధర్మం. మన భవిష్యత్తు తరాల కోసం, నేడు ప్లాస్టిక్ కు గుడ్ బై చెప్పాలి అని డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

విశాలాంధ్ర-గిద్దలూరు : చదవడం మాకిష్టం అనే కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు గ్రంథాలయంలో ఆదివారం జరిగిన వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలైన విద్యార్థులు జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతి దివ్య, రెండో బహుమతి ప్రేమ్ స్వరూప్, మూడో బహుమతి జెస్మిత, సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతి రాజశేఖర్ రెండవ బహుమతి సాయి ప్రతాప్, మూడవ బహుమతి భాస్విత సీనియర్స్ జూనియర్స్ విభాగాల్లో విజేతనైన విద్యార్థులకు నంద్యాల కార్తికేయ తన సొంత నగదుతో బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ఎన్ ప్రసన్న కుమారి విశ్రాంత ఉపాధ్యా యులు గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి.రామిరెడ్డి, కార్యదర్శి ఎస్డి.ఫరూఖ్, సాయి కృష్ణ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం శాలివాహన అన్నదాన సత్రం అధ్యక్షునిగా మోహన్‌రావు

విశాలాంధ్ర-మార్కాపురం : శ్రీశైలం శాలివాహన అన్నదానసత్రం నూతన అధ్యక్షునిగా మార్కాపురం పట్టణానికి చెందిన మున్సిపల్ వైస్ చైర్మన్ చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాసులు సోదరుడు మోహన్రావు ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఐలాపురం వెంకయ్య, మోహన్రావును సత్రం అధ్యక్షునిగా నియమించినట్లు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భముగా మోహన్‌ను పలువురు అభినందించారు.

CHANGE OF NAME

I, SHAIK PEERLA SHABBIR (Old Name), **S/O. BURHAN BASHA,** Date of Birth 04-07-1990, D.No.8-105, sankavaram Village & Post, Kanigiri Mandal, Prakasam District, A.P.-523254. I have Changed my name as **SHAIK PEERLA SHABBEER** (New Name), **S/o. BURHAN BASHA,** Hereafter my name is Known as **SHAIK PEERLA SHABBEER** (New Name), **S/o. BURHAN BASHA,** for all purposes.

NOTICE

THE EMPLOYEES INSURANCE COURT AND CHAIRMAN, INDUSTRIAL TRIBUNAL CUM PRESIDING OFFICER LABOUR COURT GUNTUR

C.C. No. 10/2024

Between:
Employees' State Insurance Corporation, Having its Regional Office at 48-7/32A. Ministry of Labour & Employment, Govt. of India, ESI Road, Gunadala, Vijayawada, A.P.-520004. Rep. by its Authorized person Social Security Officer. ...Complainant

And

M/s. Kalyani Restaurant, Dharavari Garden and Another ....Accused.

To,
Accused-1:M/s. Kalyani Restaurant, Rep. by its Proprietor A Kondala Rayudu, Dharavari Garden, Ongole-523 331.
Accused-2: Sri A Kondala Rayudu, Proprietor, No. 214, Bhagya Nagar, 2nd Line,Ongole-523 002.

పై నెంబరు కేసులో ముద్దాయిలు అయిన మీకు పై కోర్టు వారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసు నిమిత్తం **ది.28-07-2025**కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజు **ఉ.గం.10-30ని.** లకు పై కోర్టు వారి యెదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో మీపరోక్షంగా విచారించి తీర్మానించబడును.
వాయిదా **తేది:28-07-2025.**

గాదె ఎరుకల రెడ్డి, కంప్లైనెంట్ తరపు అడ్వకేట్, బ్రాడీపేట, గుంటూరు, సెల్: 9848349516

ఘనంగా నారాయణస్వామి ఆరాధన మహోత్సవం

విశాలాంధ్ర-సి ఎస్ పురం : మండలంలోని రెడ్డి కొత్తపల్లి సమీపంలోని నారకొండలో వెలసిన ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం శ్రీనారాయణ స్వామి దేవస్థానం నందు ఆదివారం స్వామివారి ఆరాధన మహోత్సవ కార్యక్రమంను పూజారి రోశిరెడ్డి (శాంతానంద స్వామి) మరియు పి.సి. తిరుపాలు ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు ఆలయంను ప్రత్యేక అలంకరణ చేసి స్వామివారిని పట్టు వస్త్రాలతో పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా ఉదయం స్వామివారికి సుప్రభాత సేవ, గణపతి పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారి విగ్రహానికి పంచామృతాభిషేకం పూజ కార్యక్రమాలు నిర్వహించి తదుపరి స్వామివారికి మేళ తాళాలు నడుమ మంత్రోచ్చారణలతో వివిధ హోరీమ పూజలు, కలశ స్థాపన కార్యక్రమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు స్వామివారి సన్నిధిలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో

పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు పూజారుల మంత్రోచ్చారణలతో స్వామివారికి పూలు సమర్పించారు భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు మేళతాళాల నడుమ పాశం పెద్దక్క ఆధ్వర్యంలో స్వామివారికి మహానైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేసి కర్పూరహారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు . సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా అంకమ్మ తల్లి భజన బృందం వారిచే కులుకు భజన, బెంగళూరు వారిచే భరతనాట్యం, డాన్స్ బేబీ డాన్స్ కార్యక్రమాలు నిర్వహించారు ఆలయ ఆవరణలో మండలంలోని జినుగువారిపల్లి గ్రామానికి చెందిన జిలకర నారాయణ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్వామివారి ఆరాధన మహోత్సవ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఆలయ ప్రాంగణమంతా భక్త జనసందడితో నిండిపోయింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జిలకర నారాయణ కుటుంబ సభ్యులు, సిఎస్పురం సర్పంచ్ శ్రీ రామ్ పద్మావతి, చావా చంద్రశేఖర్,పులి రామిరెడ్డి, ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, మధుసూదన్ (కండక్టర్) రిటైర్డ్ టీచర్ నరసయ్య, లక్ష్మీదేవి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జోరు వర్షం ... రైతన్న హర్షం

విశాలాంధ్ర -తాళ్లూరు: మండలంలో ఆదివారం సాయంత్రం జోరుగా వర్షం కురియటంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆశించిన మేర జూన్, జులై నెలలలో వర్షపాతం లేక పోవటంతో ఖరీఫ్లో పంటల సాగు మందగించినది. దీంతో 18న 59.8 మి.మీల మేర వర్షపాతం నమోదు కావటంతో రైతులు కొంత మేర సాగుకు సిద్ధం అయ్యారు. మరలా గత రెండు రోజుల నుండి ఉక్కపోతతో కూడిన ఎండలు వస్తుండటంతో ఆందోళన చెందారు. ఆదివారం సాయంత్రం మరలా మంచి వర్షపాతం నమోదు కావటంతో రైతన్నలలో ఆశలు చిగురించాయి.

21వరకు తపాలా సేవలు బంద్

విశాలాంధ్ర - ఒంగోలు టౌన్: తపాలా సేవలు ఆధునాతన సేవలలో భాగంగా సోమవారం వరకు తపాలా సేవలు జిల్లాలో తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రకాశం డివిజన్ సీనియర్ సూపరిండెంట్ శ్రీ మహమ్మద్ జాఫర్ సాధిక్ తెలిపారు. జిల్లాలోని 452 తపాలా కార్యాలయాల్లో సేవల సామర్థ్యంలో పెంపు , సెల్ ద్వారా ఆర్థిక, భీమా, బ్యాంకింగ్ ఇతర లావాదేవీలు నిర్వహణతో పాటు మెరుగైన ట్రాగింగ్తో వినియోగ దారులకు సేవలు అందించటం జరుగుతుందని చెప్పారు. 22వ తేది నుండి తపాలా కార్యాలయాల్లో సేవలు పున: ప్రారంభమౌతారని చెప్పారు.

టీడీపీ నేత శివయ్య మృతి

విశాలాంధ్ర-పామూరు రూరల్ : మండలంలోని బోడవాడ గ్రామ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి, నీటి సంఘం అధ్యక్షుడు వెల్లంకి శివయ్య ఆదివారం సాయంత్రం ఆకస్మిక మృతి చెందారు. ఆయన మృతి పట్ల కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. మండల టిడిపి అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు, కనిగిరి ఏఎంసీ చైర్మన్ యారవ రమా శ్రీనివాస్, అధ్యక్షులు ఉప్పలపాటి హరిబాబు, వివిధ ప్రతిభావంతుల రాష్ట్ర కార్యదర్శి అడుసుమిల్లి ప్రభాకర్ చౌదరి, మోపాడు ప్రాజెక్టు సూపర్ చైర్మన్ మంచు కొండయ్య ,మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య తదితరులు ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు సత్కారం

విశాలాంధ్ర-ఒంగోలు : చీమకుర్తి మండలం విద్యా సదస్సుకు సహకారం అందించిన రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావుకు యుటిఎఫ్ చీమకుర్తి మండల శాఖ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఒంగోలు లోని శిద్దా రాఘవరావు నివాసంలో ఆయనను కలిసి మండల విద్యా సదస్సు విజయవంతానికి సహకారం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శిద్దా రాఘవరావు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి యుటిఎఫ్ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. విద్యాభివృద్ధికి యుటిఎఫ్ చేస్తున్న కృషి కి ఎల్లవేళలా తన వంతు సహకారం ఉంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవరావును యుటిఎఫ్ నాయకులు దుశ్శాలువ తో.ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఎన్ చిన్నస్వామి, జిల్లా కార్యదర్శి నల్లూరి వెంకటేశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శి చలువాది శ్రీనివాసరావు, కోశాధికారి పర్వతం వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు ఎస్.కె సిలార్, బి ఆంజనేయులు, ఎం నాగార్జున, కొప్పర్తి శ్రీను పాల్గొన్నారు.

లలితమ్మకు ఆషాడం సారే ఉత్సవం

విశాలాంధ్ర-సి ఎస్ పురం : మండలంలోని అయ్యలూరివారిపల్లి గ్రామంలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలోని శ్రీ లలితమ్మ తల్లికి ఆషాడ సారే ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు ఈ వేడుకలలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీరెలు, జాకెట్లు, గాజులు, పూలు, పండ్లు, తాంబూలాలతో మేళ తాళాల మధ్య ఆషాడ మాస సారె సమర్పించి అమ్మవారికి పూజలు నిర్వహించారు అనంతరం గోరింటాకు పెట్టుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంనకు జిల్లా సహకన్వీనర్ ఎం గోవర్ధని పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఆషాడమాసంలో వాతావరణ మార్పుల కారణంగా ఇంటిల్లపాది సుఖసంతోషాలతో ఆరోగ్యం బాగుండాలని, వ్యవసాయ పనులకు అనుకూల సమయం కనుక పాడిపంటలు బాగా అభివృద్ధి చెందాలని గ్రామ దేవతకు ఆషాడం సారె కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు మండల కమిటీ సభ్యులు నేలటూరి రమణారెడ్డి మాట్లాడుతూ పంచాంగం ప్రకారం తెలుగు నెలల్లో ప్రతి నెలకు ఒక్కొక్క విశిష్టత ఉందని అందులో ఆషాడ మాసంలో అమ్మవారికి సారే, వివిధ రకాల పూజలు చేయడం వలన శుభ ఫలితాలు వస్తాయని,ఈ మాసానికి దైవ బలం ఎక్కువని ఈ మాసంలో మంత్రోచ్చారణ చేయడం వలన కుటుంబం అభివృద్ధి చెందుతుందని, పలు రకాల దోషాలకి హోమాలు ద్వారా పరిష్కారం లభిస్తుందని తెలిపారు ఈ కార్యక్రమానికి గ్రామ ధార్మిక సమితి సభ్యులు, గ్రామస్తులు మరియు ఖండ ధర్మప్రచారక్ .అచ్యుతరావు పాల్గొన్నారు.

ప్రజల అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర-గిద్దలూరు : ప్రజల మనోభావాలను గౌరవించి వారి ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటును ఇస్తామని జనసేన గిద్దలూరు ఇన్చార్జి బెల్లంకొండ సాయి బాబా, మార్కెట్ యార్డు డైరెక్టర్ సుధా తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిద్దలూరు నియోజకవర్గంలో విద్య వైద్య రంగాల్లో అగ్రగామిగా ఉండేటందుకు వాళ్ళు చైతన్యం కొచ్చేందుకు 90 సంవత్సరము నుండి విస్తృతంగా గ్రామాల్లో తిరుగుతూ యువకులను చైతన్యవంతులు చేశామని అన్నారు. నేపథ్యంలో కూటమి ప్రభావం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు విస్తృతి పెరిగిందన్నారు.ప్రభుత్వం మార్కెట్ యార్డు డైరక్టరుగా సుధ ను నియమించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

నారకొండ నారాయణస్వామికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-సి ఎస్ పురం : ఆదివారం మండలంలోని నారకొండ ధ్యాననారాయణస్వామి ఆరాధన సందర్భంగా పామూరు మండలం ఇనిమెర్ల పంచాయతీ ప్రముఖులు, గ్రామ టిడిపి అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు దంపతులు కుటుంబసభ్యులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలుచేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఈసందర్భంగా దేవస్థానం నిర్వాహకులు అర్చకులు నల్లబోతుల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈకార్యక్రమంలో పలువురు భక్తులు,అభిమానులు పాల్గొన్నారు.

'ఆకుపాటి'కి అభినందనలు

విశాలాంధ్ర-పామూరు : లక్ష రూపాయలు విలువ చేసే బంగారు గొలుసు తమ పాపది పోయినది అని బాధితుడు షేక్ శంషూర్ ఎంపీటీసీ సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ దృష్టికి ఆదివారం తెచ్చారు. స్పందించిన వెంకటేష్ సి.సి ఫుటేజ్లను పరిశీలించి చిన్న పాప పడవేసుకున్న గొలుసును తీసుకున్న యువకులను గుర్తించారు. ఆ యువకులను పిలిపించి వారి ద్వారానే బాధితులకి గొలుసును అప్పగించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో బాధితులు షేక్ సంసూర్ కుటుంబ సభ్యులు ఆకుపాటి వెంకటేష్ని అభినందించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీ మిథున్‌రెడ్డి అరెస్టు అక్రమం

-మాజీ ఎమ్మెల్యేలు అన్నా, జంకె

విశాలాంధ్ర-మార్కాపురం : ఎంపీ మిథున్‌రెడ్డిని సిట్ అధికారులు అరెస్టు చేయడం అక్రమమని మార్కాపురం వైయస్సార్సిపి ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, నెల్లూరు పార్లమెంటు పరిశీలకుల జంకె వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ వైయస్సార్సిపి నాయకులు, ప్రజా ప్రతినిధులను అక్రమంగా కేసులు పెట్టి జైల్లో పెట్టడం దారుణమని అన్నారు. వైయస్సార్సిపి నేత, లోక్‌సభ పక్ష నేత అయిన మిథున్‌రెడ్డిని మద్యం కేసులో అరెస్టు చేయడాన్ని వారు ఖండించారు. లేని కేసును సృష్టించి అబద్ధపు సాక్ష్యాలతో ఎంపీని అరెస్టు చేసిన విధానాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. సిట్‌ను ఏర్పాటుచేసి అక్రమ కేసులు పెట్టి అరెస్టు చేయడం మంచిపద్ధతి కాదన్నారు. వెంటనే విడుదలచేయాలని కోరారు.

వృద్ధులకు వస్త్రాలు,పండ్లు పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు : ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయం నందు కాశీ రత్నమ్మ చిత్రపటానికి పూలమాలవేసి పలువురు ప్రముఖులు నివాళులు అర్పించడం జరిగినది. ఈ సందర్భంగా మారెళ్ళ వివేకానంద మాట్లాడుతూ మా తల్లి మారెళ్ళ కాశీ రత్నమ్మను స్మరించుకుంటూ ఆదివారం శివం శరణాలయంలో వృద్ధులకు భోజనం ఏర్పాటు తో పాటు వృద్ధులకు నూతన వస్త్రాలు పండ్లు కాయలు పంపిణీ చేశామని చెప్పారు. మహిళ అభ్యుదయ సమితి రాష్ట్ర అధ్యక్షురాలు టీ. అరుణ మాట్లాడుతూ మారెళ్ళ వెంకటేశ్వర్లు-కాశీరత్నమ్మ కుటుంబం మానవత్వంతో పేదలకు సహకారం అందించే వారని కొనియాడారు. ఈ సందర్భంగా ఒంగోలు నగరంలో 300 మంది అనాథలకు యాచకులకు పౌష్టిక ఆహారంతో కూడిన భోజనం మారెళ్ళ కాశీరత్నమ్మ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ సేవ కార్యక్ర మంలో మారెళ్ళ కాశీరత్నమ్మ కుటుంబ సభ్యులు పేల ప్రోలు రామకృష్ణ పరమహంస (బిర్లా) బ్రహ్మానందం మారెళ్ళ సుబ్బారావులతో పాటు మాజీ మున్సిపల్ చైర్మన్ యక్కల తులసిరావు, దామచర్ల పూర్ణచంద్రరావు, అయ్యన్న, రావుల పద్మ సినీ నటులు దన్నారపు మస్తానావు పాల్గొన్నారు.

కొప్పెరపాడు పంచాయతీలో సామాజిక తనిఖీ

విశాలాంధ్ర - బల్లికురవ : డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఎస్ఎస్ఎఎటి డైరెక్టర్ శ్రీకాంత్ పర్యవేక్షణలో బల్లికురవ మండలం కొప్పెరపాడు గ్రామ పంచాయతీలో సామాజిక తనిఖీ బృందం ఐఈసి,ఇన్ఫర్మేషన్,ఎడ్యుకేషన్ బృందం ద్వారా ఉపాధి శ్రామికులకు ఉపాధి హామీ పథకం యొక్క హక్కులు,రాజీలేని అంశాలు, ఎంపిక చేయబడిన పనులు, సామాజిక తనిఖీ గురించి ఆదివారం అవగాహన నిర్వహించారు . ఎస్.ఆర్.పి కనకారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకెళ్లి 100 రోజులు పని కల్పించాలని,జీవనోపాధిని మెరుగుపరచుకోవాలని కూటమి ప్రభుత్వం అందిస్తున్న మద్దతును, పెరిగిన వేతనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్, డిఆర్పీలు పాల్గొన్నారు.

రేపల్లె బార్ అసోసియేషన్‌లో సమస్యలను పరిష్కరించాలి: వెంకట గిరిధర్

విశాలాంధ్ర - రేపల్లె : ఏళ్ల తరబడి రేపల్లె బార్ అసోసియేషన్‌లో పలు సమస్యలు ఉన్నాయని సమస్యలను పరిష్కరించేందుకు గుంటూరు బార్ అసోసియేషన్ ఫెడరేషన్ చైర్మన్ వై.శివ సూర్యనారాయణని మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలను విన్నవించినట్లు రేపల్లె బార్ అసోసి యేషన్ అధ్యక్షుడు గరికపాటి వెంకట గిరిధర్ చెప్పారు. ఈ కార్యక్రమంలో రేపల్లె బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గరికపాటి వెంకటగిరిధర్, జనరల్ సెక్రటరీ ఉప్పాల శ్రీనివాసరావు ,ఇ.సి (ఎక్సిక్యూటివ్ కమిటీ) మెంబర్లు మెండు వెంకటసుబ్బారావు, మోర్ల కృష్ణారామ్, ఉప్పాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులుగా నాగరాజు, కొండయ్య నియామకం

విశాలాంధ్ర - పర్చూరు : బాపట్ల జిల్లా ప్రథమ మహాసభ కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో నాగరాజు అధ్యక్షతన జరిగింది. కౌలు రైతు సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నాగరాజు, కార్యదర్శిగా కొండయ్యను ఎన్నుకున్నారు .సభలో కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరి బాబు మాట్లాడుతూ వ్యవసాయం సంక్షోభంలో ఉన్నదని, పంటలకు గిట్టుబాటు ధరలు లేని పరిస్థితి నెలకొందని సంవత్సరం పొగాకు రైతులు, మిర్చి రైతులు , వరి రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు సిహెచ్ గంగయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్య ఇవ్వాలని, రుణ సౌకర్యం పెంచాలని తెలిపారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి రామారావు, సిఐటియు నాయకులు ఎన్ బాబురావు, సంఘం నాయకులు సురేష్ మాట్లాడారు. మహాసభలో గ్రామ నాయకులు ద్రాక్షారం శ్రీను, సిహెచ్ హను మంతరావు , ద్రాక్షారామం ఏడుకొండలు, నాగేశ్వరరావు ఉన్నారు.

తిరునాళ్ల మహోత్సవంలో కె పి

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు మండలం తిమ్మాపురం గ్రామంలో ఈశ్వర విగ్రహ ప్రతిష్ట మరియు అంకాలమ్మ గ్రామ దేవతల ప్రతిష్ట అనంతరం 40 రోజుల తిరునాళ్ల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, గిద్దలూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి కేపీ నాగార్జున రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవత మూర్తులకు ఆయన పూజలు నిర్వహించారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్నాలకు పట్టుకొమ్మలైన పల్లెలను నిర్లక్ష్యం శాఖ అభివృద్ధి కోసం ప్రణాళికబద్ధంగా కృషి చేస్తున్నట్లు గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి ఆకువీడు గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి దయగా మౌలిక వసతులు కల్పించేందుకు తన వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు గ్రామాల్లో తాగునీరు రహదారులు ఎటువంటి ఇబ్బందికర పరిస్తితి లేకుండా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వియం చేసుకొని పట్టణాలకు దీటుగా గ్రామాలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షిప్తం చేశారు. ఆకువీడులోని పురవీధులలో తిరుగుతూ ప్రజలకు సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేసి బాగోగులు అడిగి తెలుసుకున్నారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు కటికే యోగానంద్, రాళ్లల సొసైటీ అధ్యక్షుడు గోపిరెడ్డి భువనేశ్వర్ రెడ్డి మైనార్టీ నాయకుడు సన్నావుల్లా ఖాన్,సర్పంచి దేవిడ్ మాజీ సర్పంచి బ్రహ్మయ్య గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత కంటి మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర - రేపల్లె : శంకర కంటి ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ ఆఫ్ రేపల్లె రూరల్ ద్వారా ఉచిత నేత్ర చికిత్స శిబిరం ఆదివారం పట్టణంలోని ఉప్పుడి రోడ్‌లోని వీరవల్లి కోటయ్య ఫంక్షన్ హాల్ నందు జరిగింది. ఈ శిబిరానికి మంచి స్పందన లభించింది. 300 మంది క్యాంపుకు హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. వీరిలో 207 మందికి కంటి శుక్లలు ఉన్నావని గుర్తించి వారిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వారిని ఈనెల 28,30,31, తేదీలలో అలాగే ఆగస్టు 1 తేదీన 207 మందిని విడతలవారీగా గుంటూరు శంకర ఆసుపత్రి వారి వాహనంలో రేపల్లె నుండి తీసుకొని వెళ్లి ఆపరేషన్ జరిపించి తిరిగి రేపల్లెకు తీసుకొని రావడం జరుగుతుందని తెలిపారు. ఈ శిబిరానికి కావాల్సిన ఆర్థిక సహకారాన్ని సత్యసాయి జువెలర్స్ అధినేత ఆకుల సాయిరాం వారి తండ్రి కీర్తిశేషులు పూర్ణచంద్రరావు జ్ఞాపకార్థం అందించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రేపల్లె రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.తొలుత కార్యదర్శి టి.రామకృష్ణ స్వాగతం పలికారు. ముఖ్య అతిథిగా రోటరీ అసిస్టెంట్ గవర్నర్ ఈ పూర్ణచంద్,సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ చైర్మన్ ఎంఎం సక్సేన, శంకర్ కంటి ఆసుపత్రి వైద్య సిబ్బంది, డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, పద్మా వతి రంగారావు, రోటరీ క్లబ్ సభ్యులు మల్లెల రామచంద్రరావు, గొట్టుముక్కల బాపారావు, ఏపూరి సాయేశ్వరరావు, కేసన నాగమల్లేశ్వర రావు, వార్డెన్ ప్రసాద్, కొల్లి భవానీ, కుడితపూడి హరిత పాల్గొన్నారు.

వైసీపీ మండల కన్వీనర్‌గా ఎస్సీలను నియమించాలి

విశాలాంధ్ర - పర్చూరు : పర్చూరు మండలానికి వైసీపీ కన్వీనర్‌గా ఎస్సీలను నియమించాలని కోరుతూ స్థానిక పరివర్తన భవన్ లో ఆదివారం వైసీపీ ఎస్సీ నాయకులు సమావేశం నిర్వహించా రు.పర్చూరు మండల కన్వీనర్ గా ఎస్సీలకు కేటాయించాలి అని తీర్మానం చేసుకున్నారు. పర్చూరు నియోజకవర్గంలో దళితుల ఓట్లు అధికంగా ఉన్నాయని, పర్చూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల కన్వీనర్లను ప్రకటించగా ఎస్సీలకు ఒక మండలంలో కూడా కన్వీనర్‌ను నియమించలేదని పర్చూరు వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి దృష్టికి తీసుకువెళ్ళాలి అని తీర్మానం చేసుకున్నారు. సామాజిక వర్గ పరంగా గతంలో ఇంకొల్లు మండలానికి ఎస్సీని కన్వీనర్‌గా నియమించారని, ప్రస్తుత కమిటీలో 6 మండలాలలో ఎస్సీలకు ఇవ్వకుండా ఇతర సామాజిక వర్గాలకు ఎంపిక చేశారని వాపోయారు.పర్చూరు కన్వీనర్‌గా ఎస్సీలకు అవకాశం ఇవ్వాలని తీర్మానం చేశారు.ఈ సమావేశంలో వైసిపి ఎస్సీ నాయకులు గేరా స్వరాజ్, కూరాకుల ఇస్సాకు, కట్టా రత్నం, గుజ్జర్లపూడి చిన్న, కూరాకుల రాజేష్, జూపూడి రోశయ్య, మద్దిరాల శాంతారావు, విజయ్ ,బిళ్ళ అశోక్, గద్దె జాన్ ,అల్లడి చెన్నయ్య ,చింతా సురేష్, రూబేను తదితరులు ఉన్నారు.

కల్లుగీత కార్మికుడికి గాయాలు

విశాలాంధ్ర - రేపల్లె : ఇసుకపల్లిలోని కల్లుగీత కార్మికుడు పడమటి మస్తాన్ తాడిచెట్టు ఎక్కుతూ కిందకు పడడం జరిగింది. దీనివలన అతని నడుం పూర్తిగా దెబ్బతిని కూర్చోలేని స్థితిలో ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ వెంటనే స్పందించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు తక్షణ సాయంగా అందించారు. అంతేకాకుండా ఇసుకపల్లి గౌడ సంఘీలు రూ.5500. నగదు రూపంలో అందించారు. గుంటూరు జిల్లా గౌడ బందు సేవా ట్రస్ట్ తరఫున చైర్మన్ వీరంకి రంగారావు, తుళ్లూరు శ్రీనివాసరావు, చెన్ను విజయలక్ష్మి, చెన్ను రవితేజ, రూ. 15000 చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె గౌడ సంఘీలు ఉమ్మడి గుంటూరు జిల్లా తెలుగు నాడు కల్లుగీత కార్మిక అధ్యక్షులు చెన్ను నాగమల్లేశ్వరరావు, రేపల్లె పట్టణ కల్లుగీత కార్మిక సొసైటీ అధ్యక్షులు కేసన రాంబాబు, శారద ఐటిఐ కరస్పాండెంట్ బడుగు వెంకటనారాయణ, బొర్రా సురేష్ బాబు, బొలగాని గోపి, బొలగాని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

విశాలాంధ్ర-టంగుటూరు : ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కరించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అధికారులను ఆదేశించారు. ఆదివారం మండలంలోని తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ ఎంపీడీఓలు, ఎమ్మార్వోలతో మంత్రి స్వామి విడివిడిగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో రెవిన్యూ సమస్యలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి లైట్లు వంటి ప్రజా సమస్యలపై మంత్రి చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పకుండా వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. రైతుల భూ సమస్యలు, ఆన్లైన్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి. గ్రామాల్లో పచ్చదనం, పారిశుద్యాన్ని పెంపొందించాలి. డ్రెయిన్లు, సైడ్ కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీయాలన్నారు. గ్రామాల్లోని అన్ని వీధుల్లో లైట్లు ఏర్పాటు చెయాలి. అధికారులు ప్రజా సమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యతగా పని చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.